E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 24-06-2025 (వారం) మంగళవారం

హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




పాస్‌పోర్ట్ ధృవీకరణలో తెలంగాణ పోలీసులు టాప్ » 2లో

## అమెరికాపై ఇరాన్ ప్రతీకార దాడులు



**దోహా గగనతలంలో ఇరాన్ క్షిపణులు**

**ఖతార్‌లోని అమెరికా స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులు**

**ఆపరేషన్ బేషరత్ ఫతాహ్ పేరిట మిస్సైళ్లతో మెరుపుదాడి**

**వైట్‌హౌజ్ సిచ్యుయేషన్ రూమ్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న ట్రంప్**

**ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ దాడుల పర్వం కొనసాగింపు**

**అంతకుముందే ముప్పేట దాడులుచేసిన ఇజ్రాయెల్**

**ఆరు ఇరాన్ సైనికవిమానాశ్రయాలపై ఇజ్రాయెల్ బాంబుల వాన**

**15 యుద్ధవిమానాలు, హెలికాప్టర్లు నాశనం**

ఈ కబురు,టెహ్రాన్/టెల్ అవీవ్/దోహా/వాషింగ్టన్/న్యూఢిల్లీ: కీలక అణుక్షేత్రంపై భారీ బాంబులేసి వినాశనం సృష్టించిన అగ్రరాజ్యంపై ఇరాన్ యుద్ధాగ్రహంతో దూసుకెళ్లింది. తన క్షిపణులకు పనిచెప్పింది. ఖతార్‌లోని అమెరికా వైమానికస్థావంపై సోమవారం రాత్రి క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్, ఇరాక్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలపైనా దాడిచేసినట్లు వార్తలొచ్చాయి. దోహా నగర సమీపంలోని అల్-ఉదేయిద్ అమెరికా ఎయిర్‌బేస్‌పై ఆరు స్వల్ప శ్రేణి, మధ్యస్థాయి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడులకు ఇరాన్ 'ఆపరేషన్ బేషరత్ ఫతాహ్' అని పేరుపెట్టింది. ఇరాక్‌లోని అయిన్ అల్ అసద్ బేస్‌పై ఇరాన్ రాకెట్లను ప్రయోగించింది. అయితే ఇక్కడ ఏ స్థాయిలో ధ్వంసం జరిగిందనేది తెలియరాలేదు. అయితే క్షిపణులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని అమెరికా ప్రకటించింది. తమ స్థావరాలపై దాడుల నేపథ్యంలో శ్వేతసౌధంలోని సిచ్యుయేషన్ రూమ్‌కు వెళ్లి తాజా పరిస్థితిపై రక్షణ మంత్రి హెగ్సెత్, జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డ్యాన్ కెయిన్, ఉన్నతాధికారులతో అధ్యక్షుడు ట్రంప్ సమీక్ష జరుపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పలు దేశాల్లోని స్థావరాలపై ఇరాన్ క్షిపణులు దూసుకొస్తుండటంతో సమీప దేశాలు అప్రమత్తమయ్యాయి. తమ గగనతలాలను మూసేశాయి. తమ పైనా యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు కువైట్, ఖతార్, బహ్రెయిన్ ప్రకటించాయి. అల్ ఉదేయిద్ ఎయిర్‌బేస్ నుంచి జూన్ 19వ తేదీలోపే కీలక యుద్ధ, ఇంధన విమానాలను అమెరికా సురక్షితంగా వేరే చోటుకు తరలించినట్లు తాజా ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. ఉదేయిద్ బేస్‌లో ఏకంగా 10,000 మంది అమెరికా సైనికులు ఉంటారు. గత పాతికేళ్లుగా దీనిని అమెరికా వాడుతోంది. ఈ బేస్‌పై దాడులు చేయబోతున్నట్లు ఖతార్ ప్రభుత్వానికి ఇరాన్ కొన్నినిమిషాల ముందే సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

పేలుళ్ల శబ్దాలు దోహా సిటీదాకా వినిపించాయి. దీంతో ఎవరూ బయటకు రావొద్దని సంస్థలు, విద్యాలయాలు, ఆఫీస్‌లకు ప్రభుత్వం వెంటనే సందేశాలు పంపింది. ఆరు బయటకు రావొద్దని ఖతార్‌లోని తమ పౌరులకు భారత్, అమెరికా, బ్రిటన్ ఎంబసీలు అడ్వైజరీలు జారీచేశాయి.

తరువాయి 2లో

## స్థానిక ఎన్నికలెప్పుడు నిర్వహిస్తారు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్ప డు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తా మని చెప్పి, ఎందుకు చర్య లు చేపట్టలేదని అడిగింది. దీనిపై స్పష్టత ఇచ్చేందుకు 25 రోజులు సమయం కావాలని సర్కార్ బదులిచ్చింది. అక్కడి నుంచి తమకు దాదాపు రెండు నెలల సమయం పడుతుందని ఎస్ఈసీ పేర్కొంది.

తరువాయి 2లో



## బనకచర్ల'పై న్యాయపరంగా పోరాటం చేయాలని తీర్మానించిన మంత్రివర్గం

*తెలంగాణ రైజింగ్ పాలసీ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం, డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆవిష్కరణ ,రూపకల్పన, ప్రణాళికల తయారీకి జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో త్వరలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు, నాలెడ్జ్ పార్ట్‌నర్లుగా నీతి అయోగ్, ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్, విజన్ రూపకల్పనలో అన్ని ప్రభుత్వ శాఖలకు భాగస్వామ్యం , మంత్రివర్గ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం, వాకిటి ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ అలైన్‌మెంట్‌కు ఓకే, కాళేశ్వరం కమిషన్‌కు అప్పటి కేబినెట్ భేటీల మినిట్స్ ఇవ్వాలని నిర్ణయం , ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సుదీర్ఘ భేటీ*




ఈకబురు,హైదరాబాద్: 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ' డాక్యుమెంట్‌ను రూపొందించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాలని నిర్ణయించింది. ఈ మేరకు విజన్ రూపకల్పన, ప్రణాళికల తయారీకి వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయనుంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు ఈ విజన్ డాక్యుమెంట్‌లో ఉండనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3.40 గంటల నుంచి రాత్రి 9.20 గంటల వరకు సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

తరువాయి 2లో

రెండో సెంచరీ తర్వాత పంత్ స్పెషల్ సెలబ్రేషన్.. » 6లో




డ్రగ్స్ కేసు.. నటుడు శ్రీరామ్ అరెస్టు » 5లో



భగ్గుమన్న చమురు ధరలు.. ఆసియా మార్కెట్లపై ఎఫెక్ట్ » 4లో



## ఇరాన్ ప్రతీకార దాడులు..

### ధన్యవాదాలు తెలిపిన ట్రంప్

ఇరాన్ చేపట్టిన ప్రతీకార దాడులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు.



ఈ కబురు: అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా 'ఆపరేషన్ బషరత్ అల్ ఫాత్' పేరుతో ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇరాన్ నుంచి చాలా బలహీనమైన ప్రతిస్పందన కనిపించిందన్నారు. ఇరాన్ మొత్తం 14 క్షిపణులు ప్రయోగించిందని, వాటిలో 13 మిస్సైళ్లను అడ్డుకున్నట్లు తెలిపారు. మిగిలిన ఒకదానితో ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో దాన్ని వదిలేసినట్లు పేర్కొన్నారు. టెహ్రాన్ చేపట్టిన ఈ దాడిలో అమెరికన్లకుగానీ, ఖతార్‌లో ఉన్న పౌరులకు గానీ ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తినష్టం గానీ జరగలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై ట్రంప్ వ్యంగ్యంగా మాట్లాడారు. ప్రతీకార దాడులు చేపడతామని ముందే చెప్పినందుకు ట్రంప్ ఆ దేశానికి ధన్యవాదాలు తెలిపారు. ఇరాన్ ముందే హెచ్చరికలు జారీ చేయడంతో తాము అప్రమత్తం అయ్యామని, ఎవరూ ప్రాణాలు కోల్పోవడం గానీ, గాయపడడం గానీ జరగలేదన్నారు. ఇకనైనా ఇరాన్ తన పంథాను మార్చుకొని శాంతివైపు అడుగులు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇజ్రాయెల్ సైతం శాంతి ఒప్పందం కుదుర్చుకోవడానికి తాను ప్రోత్సహిస్తానని తెలిపారు. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు పెరిగిన వేళ శాంతి పెంపొందించడంలో ఖతార్ ఎమిర్ చేసిన కృషికి ఈ సందర్భంగా ట్రంప్ ధన్యవాదాలు తెలిపారు.



2018 ఎన్నికల నుంచే ఫోన్ ట్యాపింగ్.. సిట్‌కు లభ్యమైన ఆధారాలు

» 3లో



### వాళ్లంతా గాంధీ భవన్‌కు పోటెత్తకముందే కళ్ళు తెరవండి..

ఈ కబురు: 'సన్నాలకు బోనస్ బంద్. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బంద్. గ్యాస్ బండకు రాయితీ బంద్. రాజీవ్ యువ వికాసం అమలు కాకముందే బంద్. బీఆర్ఎస్ ప్రారంభించిన గొర్రెల పంపిణీ మొత్తానికే బంద్.

» 2లో

## గిరిజన బిడ్డలపై అమానుషం: 'ఎక్స్'లో కేటీఆర్ సంచల ట్వీట్





ఈ కబురు: 'హైదరాబాద్ మీదకే కాదు.. అడవి మీదకూ బుల్డోజర్లు' ఈ ప్రభుత్వం పంపిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో విమర్శించారు. పేదలు అన్న ప్రేమ లేదని.. ఆడబిడ్డలు అన్న ఇంగితం లేదని విమర్శించారు. పోడు భూముల్లో వ్యవసాయం చేసి పొట్టపోసుకుంటున్న ఆదివాసీలపై దాడి అమానుషమని పేర్కొన్నారు.

» 2లో

## సిలిండర్ లీకై పేలుడు..

భయానక దృశ్యాలు వైరల్ » 3లో





### రహస్య' చేతుల్లో.. ఖమేనీ భద్రత!

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి.. ఎవరికీ తెలియని అత్యంత రహస్య, ఉన్నతస్థాయి విభాగం భద్రత కల్పిస్తున్నట్లు సమాచారం.

» 3లో

మొదటి పేజీ తరువాయి

## బనకచర్లపై న్యాయపరంగా పోరాటం చేయాలని తీర్మానించిన మంత్రివర్గం



ఈకబురు,హైదరాబాద్: 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ' డాక్యుమెంట్‌ను రూపొందించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాలని నిర్ణయించింది. ఈ మేరకు విజన్ రూపకల్పన, ప్రణాళికల తయారీకి వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయనుంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు ఈ విజన్ డాక్యుమెంట్‌లో ఉండనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3.40 గంటల నుంచి రాత్రి 9.20 గంటల వరకు సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

**మహిళలు, రైతులు, యువత సంక్షేమానికి ప్రాధాన్యం**

విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో అన్ని శాఖలు, అన్ని విభాగాలు భాగస్వామ్యం పంచుకునేలా చూడాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆశిస్తున్న వృద్ధి లక్ష్యంగా ఎంచుకునే కార్యక్రమాలు, చేపట్టాల్సిన కార్యాచరణను విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరుస్తారు. విజన్ డాక్యుమెంట్ తయారీకి నీతి అయోగ్‌తో పాటు, ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ వంటి సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి నాలెడ్జ్ పార్టనర్లుగా వ్యవహరిస్తాయి. కేంద్రం ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో సుస్థిర సమ్మిళిత అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల వృద్ధితో పాటు మహిళలు, రైతులు, యువకుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పదోవంతు సంపదను అందించే రాష్ట్రంగా తెలంగాణ వృద్ధి సాధించాలనే భారీ లక్ష్యంతో ఈ విజన్‌కు రూపకల్పన చేయాలని అధికారులకు కేబినెట్ దిశా నిర్దేశం చేసింది.

**రైతుల సమక్షంలో సంబరాలు**

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వానాకాలం పంటలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసాను విజయవంతంగా, రికార్డు వేగంతో అందించింది. సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. మిగిలిన రూ.400 కోట్లను మంగళవారం జమ చేయనుంది. కోటీ 49 లక్షల ఎకరాలకు ఈ సాయాన్ని పంపిణీ చేసింది. అతి తక్కువ వ్యవధిలో రాష్ట్రంలోని దాదాపు 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందించింది. ఈ ఘనత సాధించిన శుభ సందర్భాన్ని రైతుల సమక్షంలోనే ఉత్సవంగా జరుపుకోవాలని కేబినెట్ నిర్ణయించింది.

**సచివాలయం ఎదురుగా రాజీవ్ విగ్రహం వద్ద..**

మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 2 వేల మంది రైతులతో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. సీఎం రేవంత్‌తో పాటు మంత్రివర్గం ఈ కార్యక్రమంలో పాల్గొననుంది. ఇక అన్ని జిల్లాల్లో రైతు వేదికలతో పాటు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు, సంబరాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సంబరాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆదేశించింది.

**ప్రతి జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ తల్లి విగ్రహం**

రాష్ట్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో డిసెంబర్ 9న ఈ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు.

**ఆర్ఆర్ఆర్ దక్షిణ అలైన్‌మెంట్‌కు ఓకే**

హైదరాబాద్ చుట్టూ నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్ ప్రతిపాదనలకు కేబినెట్ తుది ఆమోదం తెలిపింది. అంతకుముందు ఆర్ అండ్ బీ విభాగం తయారు చేసిన మూడు ప్రతిపాదనలను పరిశీలించింది. అనంతరం చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కి.మీ.ల పొడవు ఉండే ఈ అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలిపింది.

**జూలై మొదటి వారంలో సీఎల్పీ సమావేశం**

తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఏపీ తలపెట్టిన గోదావరి -బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చట్టపరంగా, న్యాయపరంగా అడ్డుకునేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, అన్ని వేదికలను ఉపయోగించుకోవాలని కేబినెట్ తీర్మానించింది. ఒక చుక్క గోదావరి జలాలను కూడా నష్టపోకుండా చిత్తశుద్ధితో పోరాడాలని నిర్ణయించింది. 2016లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో 400 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించగా, దాని ఆధారంగానే బనకచర్ల ప్రాజెక్టును ఏపీ రూపొందించిందని మంత్రివర్గం పేర్కొంది. ఈ విషయాన్ని మరిచిపోయిన బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై అబద్ధాలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారంటూ ధ్వజమెత్తింది. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను వివరించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణను సిద్ధంచేసేందుకు జూలై మొదటి వారంలో సీఎల్పీ సమావేశం నిర్వహించనుంది. ప్రాజెక్టుపై పూర్తి వివరాలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది.

**విభజన వివాదాలపై మళ్లీ చర్చలు**

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో ఇంకా అపరిష్కృతంగా ఉండిపోయిన అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల అధికారుల కమిటీల ఆధ్వర్యంలో మళ్లీ సమావేశాలను పునరుద్ధరించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీకి లేఖ రాయనుంది. 'కాళేశ్వరం' సమాచారాన్ని కమిషన్‌కు ఇవ్వనున్న సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా తెలియజేయాలనుకున్నా, సమాచారం ఇవ్వాలనుకున్నా ఈ నెల 30 లోగా ఇవ్వాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ రాసిన లేఖపై మంత్రివర్గం చర్చించింది. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని గడువులోగా కమిషన్‌కు అందజేయాలని నిర్ణయించింది. సీఎస్ ఆధ్వర్యంలో సీనియర్ అధికారులకు ఈ బాధ్యత అప్పగించింది. మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు మేరకే బరాజ్‌లను నిర్మించినట్టు కమిషన్ ఎదుట విచారణకు హాజరైన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటల రాజేందర్ వాంగ్మూలం ఇచ్చారు. నాటి మంత్రి హరీశ్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బరాజ్‌ల నిర్మాణంపై నిపుణుల కమిటీ సిఫారసులను ఆమోదించిన తర్వాతే మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని ఈటల, హరీశ్‌రావు కమిషన్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘంతో పాటు మంత్రివర్గ సమావేశాల్లో అలాంటి నిర్ణయాలు ఏమీ జరగలేదని రుజువు చేసేందుకు గాను వాటికి సంబంధించిన మినిట్స్ కాపీలను కమిషన్‌కు ప్రభుత్వం అందించనుంది.

**తెలంగాణ స్పోర్ట్స్ పాలసీకి ఆమోదం**

రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు క్రీడా ప్రమాణాలను పెంపొందించి 2036 ఒలంపిక్స్‌లో తెలంగాణ సత్తాను చాటాలనే ఉద్దేశంతో రూపొందించిన తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని కేబినెట్ ఆమోదించింది.

**మంత్రివర్గ నిర్ణయాలపై త్రైమాసిక సమీక్ష**

పరిపాలన సంస్కరణల్లో భాగంగా ఇకపై ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ సమావేశాలు నిర్వహించనుంది. మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలులో పురోగతిని సమీక్షించడానికి త్రైమాసిక సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

**మున్సిపాలిటీలుగా ఇంద్రేశం, జిన్నారం**

సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారంను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో కమిషనర్లతో పాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి ఆమోదం

మొదటి పేజీ తరువాయి

## పాస్‌పోర్ట్ ధృవీకరణలో తెలంగాణ పోలీసులు టాప్




ఈ కబురు: పాస్‌పోర్ట్ ధృవీకరణలో రాష్ట్ర పోలీసులు దేశ వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచారు. "గోల్డ్ స్టాండర్డ్" అవార్డుకు ఎంపికైనట్లు డీజీపీ కార్యాలయం నుంచి పత్రిక ప్రకటన సోమవారం వెలువడింది. ఈ అవార్డును పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా, నేడు న్యూ ఢిల్లీలో విదేశాంగ శాఖా మంత్రి చేతుల మీదుగా , డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇంటెలిజెన్స్ బి. శివధర్ రెడ్డి ఉత్తమ సేవా ధ్రువీకరణ పత్రం అందుకోనున్నారు. ఈ విజయానికి కారణం రాష్ట్ర పోలీసులు అభివృద్ధి చేసిన యాప్, అని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నాయి. పాస్‌పోర్ట్ ధృవీకరణ ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితంగా, పారదర్శకంగా అత్యుత్తమమైన ప్రజాప్రయోజనకారిగా రూపుదిద్దుకుందని వెల్లడించారు. దేశం వ్యాప్తంగా అత్యంత వేగంగా మూడు పని దినాల్లోనే ఎక్కువశాతం కేసులలో పాస్‌పోర్ట్ ధృవీకరణ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రోజుకు సగటున 2000 పాస్ పోర్టుల ధృవీకరణ జరుగుతున్నట్లు , వార్షికంగా 8 లక్షలకు పైగా మంజూరు అవుతున్నట్లు పేర్కొన్నారు. అండ్రాయిడ్ , ఐవోఎస్ , విండోస్ , లైనక్స్ అన్ని అపరేటింగ్ సిస్టమ్స్ సపోర్ట్ చేస్తుందని తెలిపారు. ఇంటెలిజెన్స్ ఇంటిగ్రేషన్ , ఇంటెలిజెన్స్ డేటాబేస్‌తో పాత నేరస్థులను గుర్తించడం జరుగుతుందన్నారు. యాప్ రాష్ట్ర పోలీసుల సాంకేతిక వినియోగ సామర్థ్యానికి తలమానికంగా నిలుస్తోందని తెలిపారు. సాంకేతికత ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలకి ప్రతిబింబంగా ఉందని పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికలెప్పుడు నిర్వహిస్తారు?



అనంతరం పిటిషనపై తీర్పును న్యాయస్థానం రిజర్వు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోరుతూ నల్లగొండ జిల్లా మల్లెపల్లి సర్పంచ్ పార్వతి, కుర్మపల్లి సర్పంచ్ శ్రీనివాస్, జనగాం జిల్లా కాంచనపల్లి సర్పంచ్ విజయ, నిర్మల్ జిల్లా తల్వెడ సర్పంచ్ అనిల్‌కుమార్, కరీంనగర్ జిల్లా చంగర్ల సర్పంచ్ వేణు గోపాల్, నిజాయితీగూడెం సర్పంచ్ మురళీధర్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.

ఈ పిటిషన్లపై జస్టిస్ టి మాధవీదేవి సోమవారం విచారణ చేపట్టారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్లను ఖరారు చేసి, వార్డు సభ్యులు, సర్పంచ్‌ల సీట్లను కులాల వర్గాల వారీగా ప్రకటించడానికి ప్రభుత్వానికి దాదాపు నెల రోజులు అవసరమని అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ తెలియజేశారు. ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని, అప్పటి నుంచి రెండు నెలల సమయం పడుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరపున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ చెప్పారు.

**ఏడాదిన్నర పూర్తయినా ఎన్నికలు లేవు**

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది జె.ప్రభాకర్, జి.భాస్కర్‌రెడ్డి, సీహెచ్. నరేశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఎన్నికలు నిర్వహిస్తామని గత అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చి.. నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మౌన ప్రేక్షకుడిలా వ్యవహరిస్తోందని, ఎన్నికల ఆలస్యంపై రాష్ట్రాన్ని ప్రశ్నించడం లేదన్నారు. కిషన్‌సింగ్ తోమర్ వర్సెస్ అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉండాల్సిందేన్నారు. పరిపాలన ప్రక్రియలు, విధానపరమైన అవసరాలతో కలిగే జాప్యాలను కారణాలుగా చూపుతూ ఎస్ఈసీ ఆ తీర్పును ఉల్లంఘించజాలదని చెప్పారు. సకాలంలో ఎన్నికలు జరిగేలా చూడటంలో ఎస్ఈసీ స్వతంత్రత, విధి అని నొక్కి చెప్పారు. విపత్తులు లాంటి అసాధారణ పరిస్థితుల్లో తప్ప ఎన్నికలు వాయిదా వేయడానికి వీలు లేదన్నారు. 2024, జనవరి 31తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిందన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కాలపరిమితి ముగిసిన తర్వాత ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. దాదాపు ఏడాదిన్నర అవుతున్నా ప్రభుత్వం, ఎస్ఈసీ ఎన్నికలు నిర్వహించడం లేదని నివేదించారు. తాజా మాజీ సర్పంచ్‌లను పక్కన పెట్టి గ్రామ పంచాయతీలను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 243ఈ, 243కేను, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 నిబంధనలను ఉల్లంఘించడమేనని వాదించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులను అందిస్తామని ప్రభుత్వం చెప్పడంతో తమ గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యకలాపాలకు కొందరు సర్పంచ్‌లు వ్యక్తిగతంగా నిధులు సమకూర్చారని, ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అన్ని పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సర్కార్, ఎస్ఈసీ మరింత సమయం కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పిటిషన్లలో తీర్పును రిజర్వు చేసింది.

## గిరిజన బిడ్డలపై అమానుషం:

### 'ఎక్స్'లో కేటీఆర్ సంచల ట్వీట్



ఈ కబురు: 'హైదరాబాద్ మీదకే కాదు.. అడవి మీదకూ బుల్డోజర్లు' ఈ ప్రభుత్వం పంపిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో విమర్శించారు. పేదలు అన్న ప్రేమ లేదని.. ఆడబిడ్డలు అన్న ఇంగితం లేదని విమర్శించారు. పోడు భూముల్లో వ్యవసాయం చేసి పొట్టపోసుకుంటున్న ఆదివాసీలపై దాడి అమానుషమని పేర్కొన్నారు. 420 హామీలను అమలు చేయలేక.. ఇవ్వని హామీలు హైడ్రా, మూసా ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లు కూల్చడం.. రోడ్ల విస్తరణ, పరిశ్రమలకు భూసేకరణ పేరుతో లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారగొండ, సిరసనగండ్లలో రైతుల పొలాల్లోకి, ఇండ్ల మీదకు బుల్డోజర్లు పంపడం ఇదే ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. పట్నం, పల్లెలు దాటి ఇప్పుడు అడవులు, ఆదివాసీల మీద పడ్డారని ఆరోపించారు. ప్రశ్నిస్తే, ఎదిరిస్తే, నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని పేర్కొన్నారు.

## వాళ్లంతా గాంధీ భవన్‌కు పోటెత్తకముందే కళ్ళు తెరవండి..



ఈ కబురు: 'సన్నాలకు బోనస్ బంద్. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బంద్. గ్యాస్ బండకు రాయితీ బంద్. రాజీవ్ యువ వికాసం అమలు కాకముందే బంద్. బీఆర్ఎస్ ప్రారంభించిన గొర్రెల పంపిణీ మొత్తానికే బంద్. ఇలా చెప్పకుంటూ పోతే కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాలు బంద్' అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు 'ఎక్స్'లో విమర్శించారు. 'ఆత్మశుద్ధిలేని యాచార మదియేల భాండశుద్ధి లేని పాకమేల?' అన్నట్లుగా కాంగ్రెస్ పరిస్థితి ఉందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పథకాలను అటకెక్కించారని.. మేనిఫెస్టోలో ఊదరగొట్టిన హామీల అమలు గాలికి వదిలేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటితే చేతలు గడప దాటవని పేర్కొన్నారు. ప్రజలను నమ్మించడం, నయవంచన చేయడంలో కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అని పేర్కొన్నారు. పాలన అంటే ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు తీర్చుకోవడం కాదని సూచించారు. రేవంత్ మాటలు వినివిని విసిగిపోయిన యాదవ, కురుమ సోదరులు గాంధీ భవన్‌కు గొర్రెలు తోలుకొని వచ్చి నిరసన తెలియజేశారని పేర్కొన్నారు. మోసాన్ని గుర్తించి, అన్ని వర్గాల ప్రజలు ఏకమై గాంధీ భవన్‌కు పోటెత్తకముందే కళ్ళు తెరవాలని సూచించారు. చెప్పిన గ్యారెంటీలు, ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల నుండి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

**మేడిగడ్డకు ఓ నీతి.. సుంకిశాలకు ఇంకో నీతా?**

మేడిగడ్డకు చిన్న రిపేర్ చేసి గోదావరి నీళ్లను లిఫ్ట్ చేసే అవకాశమున్నా బీఆర్ఎస్‌ను బద్నామ్ చేయాలనే సింగిల్ పాయింట్ ఎజెండాతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. సుంకిశాల విషయంలో మాత్రం తమ లోపాలు ఎక్కడ బయట పడతాయోనని గుట్టు చప్పుడు కాకుండా రిపేర్లు మొదలు పెట్టిందని ఆరోపించారు. మేడిగడ్డకు ఒక నీతి.. సుంకిశాలకు మరో నీతా? అని ప్రశ్నించారు. సుంకిశాల మీద ఎక్స్‌పర్ట్ కమిటీ ఎంక్వయిరీ ఉండదని.. విజిలెన్స్ కమిషన్ విచారణా ఉండదని.. జ్యుడీషియల్ కమిషన్ ఉండదని.. ఎన్డీఎస్ఏ రిపోర్ట్ కూడా ఉండదని పేర్కొన్నారు. ఇవేమీ లేకుండానే సైలెంట్‌గా రిపేర్ చేయిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ స్వార్థంతో తెలంగాణ ప్రయోజనాలు సైతం పక్కకు పెట్టడం, కాంగ్రెస్ మార్కు ప్రజా వ్యతిరేక-ప్రతిపక్ష వేధింపు పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## అమెరికాపై ఇరాన్ ప్రతీకార దాడులు



ఈ కబురు,టెహ్రాన్/టెల్ అవీవ్/దోహా/వాషింగ్టన్/న్యూఢిల్లీ: కీలక అణుక్షేత్రంపై భారీ బాంబులేసి వినాశనం సృష్టించిన అగ్రరాజ్యంపై ఇరాన్ యుద్ధాగ్రహంతో దూసుకెళ్లింది. తన క్షిపణులకు పనిచెప్పింది. ఖతార్‌లోని అమెరికా వైమానికస్థావంపై సోమవారం రాత్రి క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్, ఇరాక్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలపైనా దాడిచేసినట్లు వార్తలొచ్చాయి. దోహా నగర సమీపంలోని అల్-ఉదేయిద్ అమెరికా ఎయిర్‌బేస్‌పై ఆరు స్వల్ప శ్రేణి, మధ్యస్థాయి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడులకు ఇరాన్ 'ఆపరేషన్ బేషరత్ ఫతాహ్' అని పేరుపెట్టింది. ఇరాక్‌లోని అయిన్ అల్ అసద్ బేస్‌పై ఇరాన్ రాకెట్లను ప్రయోగించింది. అయితే ఇక్కడ ఏ స్థాయిలో ధ్వంసం జరిగిందనేది తెలియరాలేదు. అయితే క్షిపణులను తమ గగనతల రక్షణవ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని అమెరికా ప్రకటించింది. తమ స్థావరాలపై దాడుల నేపథ్యంలో శ్వేతసౌధంలోని సిచ్యుయేషన్ రూమ్‌కు వెళ్లి తాజా పరిస్థితిపై రక్షణ మంత్రి హెగ్సెత్, జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డ్యాన్ కెయిన్, ఉన్నతాధికారులతో అధ్యక్షుడు ట్రంప్ సమీక్ష జరుపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పలు దేశాల్లోని స్థావరాలపై ఇరాన్ క్షిపణులు దూసుకొస్తుండటంతో సమీప దేశాలు అప్రమత్తమయ్యాయి. తమ గగనతలాలను మూసేశాయి. తమ పైనా యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు కువైట్, ఖతార్, బహ్రెయిన్ ప్రకటించాయి. అల్ ఉదేయిద్ ఎయిర్‌బేస్ నుంచి జూన్ 19వ తేదీలోపే కీలక యుద్ధ, ఇంధన విమానాలను అమెరికా సురక్షితంగా వేరే చోటుకు తరలించినట్లు తాజా ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. ఉదేయిద్ బేస్‌లో ఏకంగా 10,000 మంది అమెరికా సైనికులు ఉంటారు. గత పాతికేళ్లుగా దీనిని అమెరికా వాడుతోంది. ఈ బేస్‌పై దాడులు చేయబోతున్నట్లు ఖతార్ ప్రభుత్వానికి ఇరాన్ కొన్నినిమిషాల ముందే సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. పేలుళ్ల శబ్దాలు దోహా సిటీదాకా వినిపించాయి. దీంతో ఎవరూ బయటకు రావొద్దని సంస్థలు, విద్యాలయాలు, ఆఫీస్‌లకు ప్రభుత్వం వెంటనే సందేశాలు పంపింది. ఆరుబయటకు రావొద్దని ఖతార్‌లోని తమ పౌరులకు భారత్, అమెరికా, బ్రిటన్ ఎంబసీలు అడ్వైజరీలు జారీచేశాయి. ఖతార్ గగనతలాన్ని మూసేయడంతో దోహాసిటీకి వెళాల్సిన రెండు ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు మార్గమధ్యంలో వెనుతిరిగాయి. కొచ్చి నుంచి మస్కట్‌కు అక్కడి నుంచి కన్నూర్‌కు తిరిగి వచ్చినట్లు ఎయిర్‌ఇండియా తెలిపింది. ప్రస్తుతం ఖతార్‌లో తమ విమానమేదీ లేదని పేర్కొంది.

**అమెరికా అండతో చెలరేగిన ఇజ్రాయెల్**

అగ్రరాజ్యం అమెరికా భీకర బాంబుదాడులు చేసి, అండగా ఉన్నానని అభయ హస్తమివ్వడంతో సోమవారం ఇజ్రాయెల్ ఇరాన్‌పై చెలరేగిపోయింది. కారాగారం, మిలటరీ విమానాశ్రయాలు, స్వచ్ఛంద సంస్థ, రెవల్యూషనరీ గార్డ్ కోర్ ప్రధాన కార్యాలయం, అణుకేంద్రం, ప్రభుత్వ ఆఫీస్... ఇలా ఇరాన్‌లోని భిన్న రంగాల భవనాలపై క్షిపణి దాడులతో ఇజ్రాయెల్ పేలుళ్ల మోత మోగించింది. కీలక ఫోర్డో పర్వతగర్భ యురేనియం శుద్ధి కర్మాగారంపై తన వంతుగా క్షిపణి దాడులు చేసి మరింత వినాశనానికి పాల్పడింది. వేల కేజీల బాంబులను అమెరికా పడేసి విధ్వంసం సృష్టించిన మరుసటిరోజే ఇజ్రాయెల్ ఇదే న్యూక్లియర్ సెంటర్‌పై దాడులకు దిగింది. టెహ్రాన్‌లోని మిలటరీ కేంద్రాలపై ఏకంగా 50 యుద్ధవిమానాలతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఆరు ఇరాన్ ఆర్మీ ఎయిర్‌పోర్ట్‌లలో నిలిపి ఉంచిన ఎఫ్-15, ఎఫ్-5, ఏహెచ్-1 విమానం సహా 15 యుద్ధవిమానాలు, హెలికాప్టర్లను ధ్వంసంచేసింది. రన్‌వేలపై బాంబులేసింది. టెహ్రాన్‌లోని పాలస్తీన్ స్క్వేర్, రెవల్యూషనరీ గార్డ్ కోర్ ప్రధాన కార్యాలయంపై, బసీజ్ వాలంటీర్ కోర్ భవనంపై దాడులు చేసింది. ఉత్తర టెహ్రాన్‌లోని ప్రముఖ మానవతా సంస్థ 'ఇరానియన్ రెడ్ క్రిసెంట్' భవనంపైనా ఇజ్రాయెల్ నిర్దయగా బాంబులేసింది. దీంతో అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ సైతం దీటుగా బదులిచ్చింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్3' పేరిట హైఫా, టెల్ అవీవ్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులను ఉధృతం చేసింది.

**యూహాత్మకంగా కారాగారంపై..**

యుద్ధంలో సాయుధ బలగాలతోపాటు నిరాయుధ ఖైదీలుండే ఎవిన్ జైలు పైనా ఇజ్రాయెల్ గురిపెట్టింది. అయితే ఖైదీల గదులపై కాకుండా కారాగారం ప్రధాన ద్వారాన్ని బద్దలకొడుతూ డ్రోన్ దాడులుచేసింది. దీంతో గేటు తునాతునకలైంది. ఇరాన్ పాలకుల నిరంకుశపాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలుపాలైన ఉద్యమకారులు, విపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలను విడిపించేందుకే ఇలా డ్రోన్‌తో గేటును ధ్వంసంచేశారని తెలుస్తోంది.

**ప్రభుత్వాన్ని పడగొట్టడంపై ట్రంప్ దృష్టి**

ఇరాన్‌ను ఏలుతున్న సుప్రీంనేత అయతొల్లా అలీ ఖమేనీ రాజకీయవర్గాన్ని గద్దె దింపాలని ట్రంప్ భావిస్తున్నట్లు ఆయన మాటల్లో స్పష్టమైంది. సోమవారం ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. '' ఇరాన్‌ను ప్రస్తుత ప్రభుత్వం గొప్ప దేశంగా అవతరింపజేయడంలో ఘోరంగా విఫలమైంది. ఇలాంటి విఫల ప్రభుత్వం అధికారంలో కొనసాగడం ఎంతవరకు సబబు అనిపించుకుంటుంది?' అని ట్రంప్‌వ్యాఖ్యానించారు. ఇరాన్‌ను ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం తమకు లేదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి హెగ్సెత్ మాట్లాడిన కొన్ని గంటలకే ట్రంప్ ఇలా తన మనసులో మాట బయటపెట్టారు.

**ఘర్షణ తగ్గేందుకు కృషిచేస్తానన్న పుతిన్**

అమెరికా జోక్యం చేసుకోవడంతో రష్యా మద్దతు కూడగట్టేందుకు మాస్కోకు వెళ్లి అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రయత్నం కొంతమేర ఫలించింది. పశ్చిమాసియాను రణరంగం నుంచి శాంతిపథంలోకి పయనింపజేసేందుకు తన వంతు కృషిచేస్తానని, ఈ విషయంలో ఇరాన్‌కు సాయపడతానని పుతిన్ సోమవారం ప్రకటించారు. '' ఇరాన్‌పై దుస్సాహసంతో అమెరికా, ఇజ్రాయెల్ దాడులుచేశాయి. అణుబాంబు తయారీకి ఎలాంటి ఆధారాలు లేకున్నా, సరైన కారణాలు లేకుండా పశ్చిమాసియాను కదనరంగంగా మార్చేసి ఇజ్రాయెల్, అమెరికా అంతర్జాతీయ ఒడంబడికల తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడ్డాయి'' అని పుతిన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# పార్టీ పటిష్ఠంగా ఉంటేనే నాయకులకు బలం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి




నూతనంగా డివిజన్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం



గచ్చిబౌలి డివిజన్ నూతన కార్యవర్గంతో రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి

### గచ్చిబౌలి డివిజన్ నూతన కార్యవర్గం నియామకం

ఈకబురు, శేరిలింగంపల్లి : పార్టీ పటిష్టంగా ఉన్నప్పుడే నాయకులు, కార్యకర్తలకు బలమని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. బిజెపి గచ్చిబౌలి డివిజన్ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను సోమవారం అందజేశారు నియోజకవర్గం పరిధిలోని మజీద్ బండలో గల బిజెపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గచ్చిబౌలి డివిజన్ ప్రభారి కేశవరావు, నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్ర రావు, డివిజన్ అధ్యక్షులు శివాసింగ్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, బీజేపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంస్కరణలు సంక్షేమం గురించి బూత్ స్థాయి నుండి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు, రాబోయే రోజుల్లో జరగబోయే జిహెచ్ఎంసి , అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చాటాలని, ఏ ఎన్నిక జరిగినా గెలుపే లక్ష్యంగా పనిచేసి గచ్చిబౌలి డివిజన్ లో కాషాయ జెండా ఎగరవేయాలని కోరారు, పదవులు పొందిన ప్రతి ఒక్కరూ కాలనీ సమస్యలపై, ప్రజా సమస్యలపై అధికార పార్టీని ఎప్పటికప్పుడు అభివృద్ధి విషయంలో నిలదీస్తూ, అందరూ సమిష్టిగా కలిసికట్టుగా పని చేయాలన్నారు, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పార్టీ తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు. పార్టీ పటిష్ఠంగా ఉన్నప్పుడే మనందరికీ మంచి బలం, భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాము అన్ని విధాల అండగా ఉంటామని, కార్యకర్తలే పార్టీకి పట్టు కొమ్మలు అని అన్నారు.నూతనంగా ఎన్నికైన గచ్చిబౌలి డివిజన్ నూతన కార్యవర్గ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. గచ్చిబౌలి డివిజన్ నూతన ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, హేమ నళిని, కిషన్ గౌలి, నరేందర్ యాదవ్, సంజీవ, సతీష్ గౌడ్, దుర్గా రామ్ ,ప్రధాన కార్యదర్శులు సురేంద్ర ముదిరాజ్, బబ్లూ సింగ్, కార్యదర్శులు రంజిత్ పూరి, రీతిక, దినేష్ యాదవ్ కోశాధికారి లలిత సూర్య సత్య సుధా ,ఎస్టీ మోర్చ అధ్యక్షులు దేవరకొండ గోపాల్, మహిళా మోర్చ అధ్యక్షురాలు ఉదయ లక్ష్మి , బీజేవైం అధ్యక్షులుగా సామ్రాట్ గౌడ్ లతో పాటు బాధ్యతలు చేపట్టిన డివిజన్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వసంత్ కుమార్ యాదవ్, మీన్ లాల్ సింగ్, నరేందర్ ముదిరాజ్, వరలక్ష్మి ధీరజ్ ,నరసింహ రావు, రవీందర్ రెడ్డి , నరేంద్ర గౌడ్, అమర్ యాదవ్ ,శ్యామ్ యాదవ్ , శివా , విశ్వనాథ్, విశాల్ సింగ్, శ్యాంలేట్ నందు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం – భవిష్యత్తును కాపాడుదాం : గంగల రాధాకృష్ణ యాదవ్



మొక్కలు నాటుతున్న రాధాకృష్ణ యాదవ్ తదితరులు

### మాదాపూర్ లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం

ఈకబురు, శేరిలింగంపల్లి : పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు చెట్లు నాటి భవిష్యత్ తరాలను కాపాడాలని మాదాపూర్ డివిజన్ బిజెపి కాంటెస్టెట్ కార్పొరేటర్ గంగల రాధాకృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి పరిధిలోని మాదాపూర్ డివిజన్ లో సోమవారం శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని డివిజన్ ఉపాధ్యక్షులు సుమన్ నాయక్, మహేందర్ యాదవ్, శీను నాయక్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంగల రాధాకృష్ణ యాదవ్ హాజరై శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బిజెపి బలిదాన్ దివస్ ను పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఒక గొప్ప దేశభక్తుడు, విద్యావేత్త అని, భారతదేశ ఐక్యతకు పాటుపడ్డ మహానుభావుడని అన్నారు. “ఒక దేశం – ఒక రాజ్యాంగం” అనే నినాదంతో కాశ్మీర్ లో భారత రాజ్యాంగం అమలుకు కృషిచేశారని గుర్తుచేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి సెక్రటరీ కిరణ్ రెడ్డి సత్యనారాయణ శ్రీగిరి, రాగిణి, నరేష్ రెడ్డి, శీను నాయక్, కోటేష్ లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిలిండర్ లీకై పేలుడు.. భయానక దృశ్యాలు వైరల్





**ముంబయిలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అయ్యి గ్యాస్ ఎగజిమ్మిన భయానక దృశ్యాలు వైరల్‌గా మారాయి.**

ఈ కబురు: ముంబయిలోని ఓ ఇంట్లో భయానక ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ తమ ఇంట్లో గ్యాస్‌స్టౌవ్‌కు సిలిండర్ బిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ గ్యాస్ పైప్ ఊడిపోయింది. దానిని తిరిగి పెట్టడానికి ప్రయత్నించినప్పటికీ పైపులో నుంచి గ్యాస్ ఎగజిమ్మడంతో సాధ్యం కాలేదు. దీంతో సిలిండర్‌ను కిచెన్‌లో నుంచి బయటకు తెచ్చి హాల్‌లో పడేసిన ఆ మహిళ భయంతో బయటకు పరుగులు తీసింది. సిలిండర్ కిందపడి ఉండడంతో పైప్ నుంచి లీక్ అయిన గ్యాస్ ఇళ్లంతా వ్యాపించింది. కొన్ని క్షణాలకు గ్యాస్ రావడం ఆగిపోవడంతో ఇంట్లోకి వచ్చిన ఆ మహిళ మరో వ్యక్తి సహాయంతో సిలిండర్‌ను అక్కడినుంచి తీయడానికి ప్రయత్నించింది. అయితే, అప్పటికే ఆ ప్రాంతమంతా గ్యాస్ లీకవడం, లైట్లు ఆన్ చేసి ఉండటంతో వంటగదిలో ఒక్కసారిగా పేలుడు లాంటి శబ్దం వచ్చి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. తెరిచి ఉన్న రెండు తలుపుల నుంచి వెంటనే వారిద్దరూ ఒక్క ఉదుటన బయటకు పారిపోవడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. వారి ఇంట్లోని హాలులో ఉన్న సీసీ కెమెరాలో ఈ భయానక దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. ఈ ఘటన ముంబయిలో చోటుచేసుకున్నట్లు పలు జాతీయ మీడియా వర్గాలు వెల్లడిస్తున్నప్పటికీ.. కచ్చితమైన ప్రాంతం మాత్రం తెలియరాలేదు. ఆ ఇంటిలో మెస్ నిర్వహిస్తున్నట్లు వీడియోలో కన్పించింది.

వీడియోలో ఉన్న సమాచారం ప్రకారం జూన్ 18న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ వీడియోను ఓ వ్యక్తి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. ‘అదృష్టవశాత్తూ ఆ ఇంటికి ఉన్న రెండు తలుపులు, కిటికీలు తెరిచి ఉండడంతో లీకైన గ్యాస్ బయటకు వెళ్లడంతో ప్రమాద తీవ్రత తగ్గింది’ అని పేర్కొన్నారు. దీంతో నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్‌ను గ్యాస్‌స్టౌవ్‌కు బిగిస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెట్టింట్లో చర్చలు మొదలయ్యాయి. ఎల్‌పీజీ గ్యాస్‌లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు నిపుణుల సలహా తీసుకోకుండా దానివద్దకు వెళ్లడం ప్రమాదకరమని ఓ నెటిజన్ పేర్కొన్నాడు. ‘వీడియో చూస్తున్నంతసేపు నేను ఊపిరి బిగబట్టే ఉన్నాను. ఇటువంటి ప్రమాదాలను నివారించాలంటే ప్రతిఒక్కరూ గ్యాస్ భద్రతకు సంబంధించిన ప్రాథమిక విషయాలను తెలుసుకోవాలి’ అని మరో నెటిజన్ రాసుకొచ్చారు. వంట పనులు పూర్తవగానే ఎప్పటికప్పుడు గ్యాస్ ఆఫ్ చేసుకోవడం సురక్షితం అని మరొకరు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# 2018 ఎన్నికల నుంచే ఫోన్ ట్యాపింగ్.. సిట్‌కు లభ్యమైన ఆధారాలు



**తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.**

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2018 ఎన్నికల వేళ ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులకు తాజాగా ఆధారాలు లభించాయి. ప్రణీత్‌రావు నుంచి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావుకు ట్యాపింగ్ సమాచారం చేరేది. ప్రభాకర్ రావు ఆదేశాలతోనే టాస్క్‌ఫోర్స్ టీమ్ రంగంలోకి దిగింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారానే ప్యారడైజ్ వద్ద భవ్య ఆనంద్‌ప్రసాద్‌కు చెందిన రూ. 70లక్షల డబ్బును టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఎన్నికల్లో పోటీ చేసిన రఘునందన్‌రావు బంధువులకు చెందిన రూ. కోటి కూడా ఫోన్ ట్యాపింగ్‌తో వచ్చిన సమాచారం మేరకే సీజ్ చేశారని తెలుస్తోంది. బేగంపేట పరిధిలో రాధాకిషన్‌రావు, ఆయన బృందం రూ. కోటి సీజ్ చేసింది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సమాచారం. నల్గొండ కాంగ్రెస్ నేతల అనుచరుల నుంచి రూ.3.50 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.

# ‘రహస్య’ చేతుల్లో.. ఖమేనీ భద్రత!



ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి.. ఎవరికీ తెలియని అత్యంత రహస్య, ఉన్నతస్థాయి విభాగం భద్రత కల్పిస్తున్నట్లు సమాచారం.

ఈ కబురు: ఆపరేషన్ ‘రైజింగ్ లయన్’ పేరిట ఇరాన్ పై ఇజ్రాయెల్ తన దాడులను మరింత తీవ్రతరం చేసింది. మరోవైపు.. అణుకేంద్రాలే లక్ష్యంగా అమెరికా సైతం విరుచుకుపడింది. ఈ పరిణామాలతో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఇప్పటికే సురక్షిత బంకర్‌లోకి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఎవరికీ తెలియని అత్యంత రహస్య, ఉన్నతస్థాయి విభాగం ఆయనకు భద్రత కల్పిస్తున్నట్లు సమాచారం. సుప్రీం లీడర్ కనుసన్నల్లో నడిచే ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ సీనియర్ అధికారులకూ ఆ విభాగం గురించి తెలియదట. ఇజ్రాయెల్ నిఘావర్గాలు ఇప్పటికే తమ ప్రభుత్వంలోని వివిధ స్థాయుల్లోకి చొరబడినట్లు ఇరాన్ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే సుప్రీం లీడర్ భద్రత కోసం ఎవరికీ తెలియని అత్యంత రహస్య యూనిట్‌ను రంగంలోకి దించినట్లు సమాచారం. ముందుగానే తనిఖీ చేసిన సిబ్బంది ఆయనకు రక్షణగా ఉన్నట్లు టెహ్రాన్ వర్గాలను ఉటంకిస్తూ ఓ అంతర్జాతీయ వార్తాసంస్థ తెలిపింది. “ ఇటువంటి పరిస్థితుల్లో శత్రువులకు ఎలాంటి అవకాశం లేకుండా ఉంచేందుకు.. ఎవరికీ తెలియని విభాగం ఆయన భద్రత బాధ్యతలు నిర్వహిస్తోంది. ఈ రహస్య యూనిట్ 24 గంటలూ విధుల్లో ఉంది” అని సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు పేర్కొంది. సాధారణ పరిస్థితుల్లో ఖమేనీ.. సెంట్రల్ టెహ్రాన్‌లోని ‘బీత్ రహ్బరి’గా పిలిచే అత్యంత సురక్షితమైన నివాసంలో ఉంటారు. అక్కడి నుంచే విధులు నిర్వహిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో తప్ప.. చాలా అరుదుగా బయటకు వస్తారు. ఇటీవల ఇజ్రాయెల్ ఖమేనీ నివాసంతోపాటు ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఉండే మొనిరియే ప్రాంతంలో వైమానిక దాడులు జరిపింది. అదేవిధంగా ఆయా దాడుల్లో అనేక మంది సీనియర్ సైనికాధికారులు, అణుశాస్త్రవేత్తలను మట్టుబెట్టింది. ఖమేనీని హతమారిస్తేనే యుద్ధం ముగుస్తుందని నెతన్యాహు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ పరిణామాలతో ఆయన్ను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. అమెరికా దాడుల అనంతరం భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. ఎటువంటి సిగ్నళ్లకు అందకుండా ఉండటానికి ఖమేనీ ఉన్న ప్రదేశంలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌లను పూర్తిగా నిలిపివేసినట్లు ఇరాన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. భారీ భద్రత మధ్య అత్యంత సురక్షితమైన బంకర్‌లో ఆయన ఆశ్రయం పొందుతున్నట్లు సమాచారం. అత్యంత సన్నిహితులైన ముగ్గురు వ్యక్తులు ప్రస్తుత పరిస్థితులు, టెహ్రాన్ ప్రతిదాడుల గురించి ఆయనతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఖమేనీ తన వారసులుగా ముగ్గురిని ఎంపిక చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ ఓ కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఐఆర్‌జీసీలోని కీలక పదవులకు నియమించాల్సిన కమాండర్ల పేర్లను కూడా ప్రకటించినట్లు పేర్కొంది.

# 15 ఎకరాల లోపు ఉన్న రైతులకు గుడ్ న్యూస్.. మంత్రి తుమ్మల కీలక ప్రకటన

ఈ కబురు: తెలంగాణలో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ. 6 వేల చొప్పున పెట్టుబడి సాయం నిధులను సోమవారం నుంచి విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఆదివారం వరకు 9 ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల బ్యాంక్ అకౌంట్లలో రైతు భరోసా నిధులను జమ చేసింది. తాజాగా 15 ఎకరాల లోపు ఉన్న రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు జమ చేస్తోంది. ఈ మేరకు ఇవాళ (సోమవారం) రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన విడుదల చేశారు. ఈ రోజు మరో 513.83 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.



# 200 టీఎంసీలే వాడుకోగలం:

## బనకచర్లపై సీఎం కీలక వ్యాఖ్యలు



ఈ కబురు: రాష్ట్రానికి బనకచర్లగేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం పాలన ఏడాది పూర్తి అయిన సందర్భంగా అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి నీళ్లు ఏపీ, తెలంగాణ వాడుకోవచ్చని చెప్పారు. 3 వేలటీఎంసీ ల గోదావరినీళ్లు సముద్రంలోకి పోతున్నాయన్నారు. ఎంత వాడుకున్నా ఏపీ 200 టీఎంసీలు.. తెలంగాణ 200 టీఎంసీలు మాత్రమే వాడుకోగలమని చెప్పారు. 2027 జూన్ లేదా డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామన్నారు. పోలవరానికి కేంద్రం రూ.12వేల 500 కోట్లు ఇచ్చిందని, కేంద్రం సహకారంతో అమరావతికి రూ.15వేల కోట్లు వచ్చాయన్నారు. పోలవరం ద్వారా ఈ ఏడాదిలోనే అనకాపల్లికి నీళ్లిస్తామని చెప్పారు. మూడేళ్లలో అమరావతికి ఓ రూపం తీసుకొస్తామని చెప్పారు. విజయవాడ, విశాఖ మెట్రో పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. రైల్వే జోన్ పనులు కూడా పూర్తవుతాయని చంద్రబాబు పేర్కొన్నారు.



# భగ్గుమన్న చమురు ధరలు.. ఆసియా మార్కెట్లపై ఎఫెక్ట్

పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో చమురు ధరలు పైపైకి వెళ్తున్నాయి. అటు ఆసియా మార్కెట్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధంలోకి అమెరికా అడుగుపెట్టడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాలతో ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. ఒక దశలో ఐదు నెలల గరిష్ఠాన్ని తాకాయి. ఈ ప్రభావం ఆసియా మార్కెట్లపైనా తీవ్రంగానే పడింది. నేటి ట్రేడింగ్‌లో చమురు ధరలు 2 శాతానికి పైగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 2.7శాతం పెరిగి 79.12 డాలర్లను చేరింది. అటు యూఎస్ క్రూడ్ బ్యారెల్ ధర 2.8శాతం ఎగబాకి 75.98 డాలర్లకు చేరింది. ఇక, ఆసియా మార్కెట్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. జపాన్ నిక్కీ 0.6శాతం, దక్షిణ కొరియా కోస్పి 1.4శాతం, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ సూచీ 0.7శాతం మేర కుంగాయి. ఐరోపా, అమెరికా ఫ్యూచర్ మార్కెట్లు కూడా ఒత్తిడికి గురవుతున్నాయి. అమెరికా ఎస్అండ్‌పీ 500 ఫ్యూచర్స్ సూచీ 0.5శాతం, నాస్‌డాక్ ఫ్యూచర్స్ 0.6శాతం మేర నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 0.1శాతం తగ్గి 3,363 డాలర్లుగా ఉంది. ఈ ప్రభావం భారత మార్కెట్ల పైనా పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడులు చేయడంతో హర్మూజ్ జల మార్గాన్ని మూసివేసేందుకు ఇరాన్ సన్నద్ధమవుతోంది. ఈ పరిణామాలు భారత్‌కు ఇబ్బందికరమేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇరాక్, జోర్డాన్, లెబనాన్, సిరియా, యెమెన్ సహా పశ్చిమాసియా దేశాలతో భారత్ నిర్వహిస్తున్న వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం చూపొచ్చని అంటున్నారు. ఇప్పటికే మన దేశం నుంచి ఇరాన్, ఇజ్రాయెల్‌కు వెళ్లే ఎగుమతులు తగ్గుతున్నాయి. యుద్ధం మరింత తీవ్రమైతే, పశ్చిమాసియా దేశాలతో మన వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపొచ్చని నిపుణులు భావిస్తున్నారు.





## దేశంలోనే తొలి హైడ్రోజన్ ప్లాంట్‌ను ప్రారంభించిన అదానీ గ్రూప్

గుజరాత్‌లోని కచ్‌లో అదానీ గ్రూప్ హైడ్రోజన్ ప్లాంట్ పైలట్ ప్రాతిపదికన ప్రారంభించింది.

**దిల్లీ:** గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో కీలక ముందడుగు పడింది. ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ భారత్‌లోనే తొలి ఆఫ్‌గ్రిడ్ 5 మెగావాట్ గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్లాంట్‌ను గుజరాత్‌లోని కచ్‌లో ప్రారంభించింది. ఈమేరకు కంపెనీ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సోలార్, విండ్ వంటి పునరుత్పాదక వనరులను ఉపయోగించుకొని నీటిని ఎలక్ట్రోలైసిస్ ప్రక్రియ ద్వారా విభజించి హైడ్రోజన్ ఉత్పత్తి చేయడం ఈ ప్లాంట్ ముఖ్యఉద్దేశం. సొంత పునరుత్పాదక కేంద్రాలను అదానీ గ్రూప్ వినియోగించుకుంది.హైడ్రోజన్ వాయువు విశ్వంలో అత్యంత తేలికైనది, స్వచ్ఛమైనది. ఇది మండినప్పుడు కేవలం నీటి ఆవిరిని ఉత్పత్తి చేస్తుంది. దేశీయ అవసరాలకు దిగుమతులపై ఆధారపడడం తగ్గించుకోవడంలో భాగంగా నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను కేంద్రం ప్రారంభించింది. ఈనేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ అదానీ న్యూ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 5 మెగావాట్ ప్లాంట్‌ను నెలకొల్పింది. దేశ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో దీన్నో కీలక ముందడుగుగా అదానీ గ్రూప్ అభివర్ణించింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో హబ్‌గా నిలవాలన్న భారత సంకల్పానికి అదానీ గ్రూప్ తనవంతు తోడ్పాటు అందిస్తోందని పేర్కొంది. గుజరాత్‌లోని ముంద్రాలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను కూడా అదానీ గ్రూప్ ఏర్పాటుచేస్తోంది.

# ఎలక్ట్రిక్ విమాన ప్రయాణం భలే చౌక.. రూ.694 ఖర్చుతో 130 కిలోమీటర్లు



పూర్తిగా విద్యుత్‌తో నడిచే విమానం తన తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. 130 కిలోమీటర్ల ప్రయాణానికి అయిన ఖర్చు రూ.700లోపే అని కంపెనీ తెలిపింది.

ఎలక్ట్రిక్ బైక్‌లు.. విద్యుత్ కార్లు ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్నవే. అయితే త్వరలోనే ఎలక్ట్రిక్ విమానాలు కూడా ఎగరనున్నాయి. ఆ దిశగా అమెరికాకు చెందిన ఓ కంపెనీ చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది. పౌర విమానయాన చరిత్రలోనే తొలిసారిగా నలుగురు ప్రయాణికులను తీసుకొని ఓ విద్యుత్ విమానం గమ్యస్థానాన్ని చేరుకుంది. పైగా ఈ ప్రయాణం కూడా చాలా చౌకగా పూర్తయినట్లు తెలిపింది. 130 కిలోమీటర్లకు గానూ తమకు 8 డాలర్లు ఖర్చయినట్లు కంపెనీ వెల్లడించింది. అంటే భారత కరెన్సీలో అక్షరాలా రూ.694 మాత్రమే..! అమెరికాలోని బీటా టెక్నాలజీస్ అనే సంస్థ అలియా సీఎక్స్300 పేరుతో 100శాతం ఎలక్ట్రిక్ విమానాన్ని అభివృద్ధి చేసింది. ఈనెల ఆరంభంలో ఈ విమానం ఈస్ట్ హాంప్టన్ నుంచి జాన్ ఎఫ్.కెన్నడీ ఎయిర్‌పోర్టు వరకు 70 నాటికల్ మైళ్ల (దాదాపు 130 కిలోమీటర్ల) మేర ఈ విమానం విజయవంతంగా ప్రయాణించింది. కేవలం 35 నిమిషాల వ్యవధిలోనే నలుగురు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చిందని బీటా టెక్నాలజీస్ సీఈఓ, వ్యవస్థాపకుడు క్లార్క్ వెల్లడించారు.

ఇందుకోసం తమకు 8 డాలర్ల ఇంధన (విద్యుత్) ఖర్చు అయినట్లు తెలిపారు. ఇదే ప్రయాణానికి సాధారణ హెలికాప్టర్లను వినియోగిస్తే ఇంధన ఖర్చు దాదాపు 160 డాలర్లు (రూ.13,800) ఉంటుందని పేర్కొన్నారు. పైలట్, ఇతరత్రా వాటికి చెల్లింపులు ఉన్నప్పటికీ.. సాధారణ విమాన ప్రయాణాలతో పోలిస్తే ఇది చాలా చౌక అని పేర్కొన్నారు. 2017లో బీటా టెక్నాలజీని క్లార్క్ స్థాపించారు. గత ఆరేళ్లుగా ఈ కంపెనీ సీఎక్స్300 మోడల్ విద్యుత్ విమానాల టేకాఫ్, ల్యాండింగ్ ప్రయోగాలు చేస్తోంది. ఇటీవల ఉత్పత్తి, సర్టిఫికేషన్, కమర్షియల్ ప్రయాణాల కోసం దాదాపు 318 మిలియన్ డాలర్ల విరాళాలు సేకరించింది. ఈ ఏడాది నాటికి ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ నుంచి అనుమతులు పొందేందుకు ప్రయత్నిస్తోంది. ఈ బీటా విమానాలకు సింగిల్ ఛార్జింగ్‌తో 250 నాటికల్ మైళ్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఉంటుంది. తక్కువ దూరంలో ఉండే ప్రయాణాలకు ఇవి మెరుగ్గా ఉపయోగపడుతాయని కంపెనీ చెబుతోంది.



## వార్ ఎఫెక్ట్: మళ్లీ నష్టాల్లో సూచీలు.. 25వేల దిగువకు నిఫ్టీ

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 511 పాయింట్లు, నిఫ్టీ 140 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య పోరులో అమెరికా జోక్యం చేసుకోవడంతో పాటు అక్కడి అణు కేంద్రాలే లక్ష్యంగా దాడులు నిర్వహించడంతో ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. చమురు ధరలకు రెక్కలు రావడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందన్న భయాలు కూడా ఇందుకు తోడయ్యాయి. ఐటీ షేర్లు ప్రధానంగా నష్టపోగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం భౌగోళిక ఉద్రిక్తతలను తట్టుకుని నిలబడడం విశేషం. ఇంట్రాడేలో భారీ నష్టాలు చవిచూసిన సూచీలు.. ఆఖర్లో కాస్త కోలుకున్నాయి. ఓ దశలో 900 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 500 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. నిఫ్టీ మళ్లీ 25 వేల దిగువన ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 81,704.07 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,408.17) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,476.76 వద్ద కనిష్ఠాన్ని తాకింది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకుంది. చివరికి 511.38 పాయింట్ల నష్టంతో 81,896.79 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140.50 పాయింట్ల నష్టంతో 24,971.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.76గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, బీఈఎల్ బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 77.35 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,381 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ఆల్‌టైమ్ కనిష్ఠానికి ఓలా ఎలక్ట్రిక్ షేరు విలువ.. కారణమేంటి?

ఓలా ఎలక్ట్రిక్ షేర్లు ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరాయి. బ్లాక్‌డీల్‌లో పెద్దసంఖ్యలో షేర్లు చేతులు మారడం ఇందుకు కారణం.

ప్రముఖ విద్యుత్తు ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ షేర్లు ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకాయి. బ్లాక్‌డీల్ కారణంగా సోమవారం పెద్ద మొత్తంలో కంపెనీ షేర్లు చేతులు మారిన నేపథ్యంలో వాటి విలువ పతనమైంది. కంపెనీలో 0.8 శాతం వాటాకు సమానమైన 44 లక్షల షేర్లు రూ.44.1 వద్ద చేతులు మారాయి. దీంతో ఈ ఉదయం బీఎస్‌ఈలో కంపెనీ షేరు విలువ 6 శాతం మేర పతనమై రూ.43.20 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. బ్లాక్ డీల్ ద్వారా ఎవరు విక్రయించారు? ఎవరు కొనుగోలు చేశారనే వివరాలు మాత్రం తెలియరాలేదు. మధ్యాహ్నం 12.50 గంటల సమయానికి ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 4.76 శాతం నష్టంతో 43.86 వద్ద ట్రేడవుతున్నాయి.

2017లో స్థాపితమైన ఓలా ఎలక్ట్రిక్ 2024 ఆగస్టు 9న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యింది. అప్పట్లో రూ.76 ఐపీఓ ధర కాగా.. రూ.91.20 వద్ద ప్రీమియంతో దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, మరోవైపు నియంత్రణ సంస్థల దర్యాప్తు, ఇంకోవైపు సంప్రదాయ ఆటోమొబైల్ సంస్థలైన బజాజ్, టీవీఎస్ నుంచి గట్టి పోటీ కారణంగా మార్కెట్ వాటా క్షీణించడం వంటి కారణాలతో షేరు విలువ పడుతూ వస్తోంది. గత 12 నెలల్లో షేరు విలువ 51 శాతం మేర క్షీణించింది. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనూ రూ.870 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే నష్టం రెట్టింపుకావడం గమనార్హం. ఈనేపథ్యంలో బ్లాక్‌డీల్ జరగడంతో కంపెనీ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇదే నెలలో నెలలో హ్యుందాయ్ మోటార్ కంపెనీ రూ.51.40 వద్ద 3.23 శాతం వాటాకు సమానమైన 14.22 కోట్ల షేర్లను విక్రయించడం గమనార్హం.

# ఆడియో పరికరాల రంగంలో ప్రమాదంలో 21,000 ఉద్యోగాలు!



దేశీయంగా ఆడియో ఎలక్ట్రానిక్స్ రంగంలో 21,000కు పైగా ఉద్యోగాలు గల్లంతయ్యే ప్రమాదం ఉందని పరిశ్రమ సమాఖ్య ఎల్సినా అంచనా వేస్తోంది.

**దిల్లీ:** దేశీయంగా ఆడియో ఎలక్ట్రానిక్స్ రంగంలో 21,000కు పైగా ఉద్యోగాలు గల్లంతయ్యే ప్రమాదం ఉందని పరిశ్రమ సమాఖ్య ఎల్సినా అంచనా వేస్తోంది. రేర్ ఎర్త్ లోహాల ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలే ఇందుకు కారణమని పేర్కొంది. వినియోగదారు ఎలక్ట్రానిక్స్ పరికరాల్లో వినియోగించే ఎన్‌డీఎఫ్‌ఈబీ (నియోడైమియంఐరన్‌బోరాన్) మ్యాగ్నెట్ల తయారీకి వాడే టెర్బియం, డిస్ప్రోసియం వంటి రేర్ ఎర్త్ లోహాల ఎగుమతులకు సంబంధించి కఠిన లైసెన్సింగ్ నిబంధనలను గత ఏప్రిల్‌లో చైనా అమల్లోకి తెచ్చింది. దీంతో అంతర్జాతీయంగా వీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడ్డాయని ఎల్సినా తెలిపింది. మన దేశంలోనూ ఆడియో పరికరాలు (హియరబుల్స్), వేరబుల్స్ తయారీలో వీటిని వినియోగిస్తున్నారు. వీటి సరఫరా లేక, ఆయా పరికరాల తయారీ నిలిచిపోతోంది. ఫలితంగా నోయిడా, దక్షిణాది రాష్ట్రాలో ఉన్న స్పీకర్, ఆడియో పరికరాల తయారీ కంపెనీల్లో 5,0006,000 వరకు ప్రత్యక్ష ఉద్యోగాలు, 15,000 పరోక్ష ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్నట్లు వెల్లడించింది. పరికరాల తయారీదార్లు చైనా నుంచి పూర్తిగా అసెంబుల్ చేసిన స్పీకర్ మాడ్యూళ్లను దిగుమతి చేసుకుంటున్నట్లు వివరించింది.

**నియామకాలు తగ్గిపోయాయ్**

పశ్చిమాసియాలో యుద్ధాల ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్న భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు మన దేశంలో నియామకాలపైనా ప్రభావం చూపుతున్నాయని స్టాఫింగ్ సొల్యూషన్స్, మానవ వనరుల సేవల సంస్థ జీనియస్ కన్సల్టెంట్స్ నివేదిక వెల్లడించింది. ప్రస్తుత ప్రతికూల వాతావరణంలో కంపెనీలు నియామకాలను ఆపేసినట్లు లేదా బృందాలను తగ్గించుకుంటున్నట్లు తమ సర్వేలో పాల్గొన్న వారిలో 63% మంది ఉద్యోగులు వెల్లడించారని నివేదిక పేర్కొంది. 15% కంపెనీలు పొరుగు సేవలు లేదా ఫ్రీలాన్స్ ఉద్యోగాలకు మొగ్గు చూపుతున్నారని తెలిపింది. మే 12 నుంచి జూన్ 6 మధ్య దేశంలోని వివిధ రంగాల్లో పని చేస్తున్న 2,006 మంది ఉద్యోగులను ఆన్‌లైన్‌లో సర్వే చేసి, ఈ నివేదిక రూపొందించినట్లు జీనియస్ కన్సల్టెంట్స్ వివరించింది. భౌగోళిక, రాజకీయ అస్థిరత్వంతో తమ వేతన వృద్ధి, బోనస్‌లు, పదోన్నతుల వంటివి ఇరకాటంలో పడ్డాయని సర్వేలో పాల్గొన్న వారిలో 36% మంది ఉద్యోగులు తెలిపారని నివేదిక వివరించింది.



## తెరవెనక ప్రపంచమే ఇష్టం

మాస్ పాటతో మురిపించేందుకు సిద్ధం అంటోంది మాళవిక మోహనన్. ఈ మాట ఇతర కథానాయికలు చెప్పడం వేరు, మాళవిక చెప్పడం వేరు. సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకునే ఫొటోలు కుర్రకారుని ఎంతగానో ఆకర్షిస్తుంటాయి.
మాస్ పాటతో మురిపించేందుకు సిద్ధం అంటోంది మాళవిక మోహనన్ . ఈ మాట ఇతర కథానాయికలు చెప్పడం వేరు, మాళవిక చెప్పడం వేరు. సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకునే ఫొటోలు కుర్రకారుని ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. మోడలింగ్ రంగం నుంచి వచ్చిన ఈమె ఫ్యాషన్‌కి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఘాటు ఘాటుగా ఫొటోలకి పోజులిస్తూ ఊరిస్తుంటుంది. అలాంటి మాళవిక మాస్ పాటలో కనిపిస్తానంటే కుర్రకారు ఆత్రుతగా ఎదురు చూడకుండా ఉంటారా? ప్రభాస్‌తో కలిసి నటిస్తున్న 'రాజాసాబ్' సినిమాలోనే మాస్ పాటతో సందడి చేస్తానని ఇటీవల చెప్పిందీమె. అన్నట్టు ఈమెకి తెలుగులో ఇదే తొలి చిత్రం. అందంతో కట్టిపడేస్తున్న ఈమె అనుకోకుండానే కెమెరా ముందుకొచ్చిందట. తెరముందు కనిపించడం కంటే, నాకు తెరవెనక ప్రపంచమే ఇష్టమని... అన్నీ అనుకున్నట్టు జరిగి ఉంటే తాను దర్శకురాలినో లేదంటే ఛాయాగ్రాహకురాలినో అయ్యేదాన్నని చెబుతోంది. ఓ దశలో ఎడిటింగ్ విభాగంలోకి వెళ్లాలని కూడా అనుకుందట. ఈమె తండ్రి కె.యు.మోహనన్ ప్రముఖ ఛాయాగ్రాహకుడు. తండ్రి అడుగు జాడల్లో నడవాలనుకున్న మాళవికని, ఆమె అందమే కెమెరా ముందుకు తీసుకొచ్చింది.

## రామోజీఫిల్మ్ సిటీపై కాజోల్ వ్యాఖ్యలు.. స్పష్టత ఇచ్చిన నటి

రామోజీ ఫిల్మ్‌సిటీపై గతంలో కాజోల్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పష్టత ఇచ్చారు.

ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీని ఉద్దేశిస్తూ బాలీవుడ్ నటి కాజోల్ గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తన కొత్త చిత్రం 'మా'ను ప్రచారం చేసుకునే క్రమంలోనే అలా మాట్లాడినట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పష్టత ఇచ్చారు.

"నా కొత్త చిత్రం 'మా'ను ప్రచారం చేసే కార్యక్రమంలో భాగంగానే రామోజీ ఫిల్మ్‌సిటీపై వ్యాఖ్యలు చేశా. నేను నటించిన అనేక సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీలో చిత్రీకరణ జరుపుకొన్నాయి. గత కొన్నేళ్లలో చాలాసార్లు అక్కడ ఆతిథ్యం పొందాను. సినిమా మేకింగ్‌కు సంబంధించిన అనువైన వాతావరణం అక్కడ ఉంటుంది. అనేక మంది పర్యాటకులు ఎంతో ఉత్సాహంగా ఉండటం నేను చాలాసార్లు గమనించాను. పర్యాటకులకు అదొక గొప్ప గమ్యస్థానం. కుటుంబం, చిన్నారులతో కలిసి ఆస్వాదించడానికి అత్యంత భద్రమైన ప్రదేశం" అని పేర్కొన్నారు.
కాజోల్ కీలక పాత్రలో విశాల్ ఫురియా దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ హారర్ మూవీ 'మా'. దుష్ట శక్తుల బారిన పడిన తన కుమార్తెను ఓ తల్లి ఎలా కాపాడుకుందనే ఇతివృత్తంగా ఈ మూవీని తీర్చిదిద్దారు. జూన్ 27న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ప్రచారంలో ఆమె మాట్లాడుతూ.. 'ఎందుకో రామోజీఫిల్మ్ సిటీలో షూటింగ్ చేస్తున్నప్పుడు నెగెటివ్ వైబ్స్ వచ్చేవి. అయితే, దేవుడి దయ వల్ల అక్కడ నాకేమీ కనిపించలేదు' అని పేర్కొన్నారు.
కాజోల్ చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల వేదికగా ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. కేవలం తన సినిమా ప్రమోషన్ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని నెటిజన్లు మండిపడ్డారు. 'ఉదయం షూటింగ్ సమయానికి సెట్స్‌ను సిద్ధం చేయడానికి ఎంతో మంది రాత్రి వేళల్లోనూ అక్కడ పనిచేస్తా'రంటూ మరో నెటిజన్ చెప్పుకొచ్చారు. తన సినిమా ప్రమోషన్ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైనది కాదంటూ మరో నెటిజన్ వ్యాఖ్యానించారు.





## రెండోసారి..

కథానాయకుడు నాని ప్రస్తుతం 'ది ప్యారడైజ్' సినిమాతో సెట్స్‌పై బిజీగా గడుపుతున్నారు. దీని తర్వాత సుజిత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది.
కథానాయకుడు నాని ప్రస్తుతం 'ది ప్యారడైజ్' సినిమాతో సెట్స్‌పై బిజీగా గడుపుతున్నారు. దీని తర్వాత సుజిత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. అయితే ఇప్పుడీ రెండూ ఇంకా పూర్తి కాకుండానే ఆయన మరో చిత్రానికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. 'హాయ్ నాన్న'తో తొలి అడుగులోనే ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు శౌర్యువ్‌తో నాని మరోసారి చేతులు కలపనున్నారని సమాచారం. వీళ్లిద్దరి కాంబోలో రూపొందనున్న ఈ కొత్త సినిమా పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ కథతో రూపొందనున్నట్లు తెలిసింది. సుజిత్ సినిమా పూర్తికాగానే ఈ ప్రాజెక్ట్ కార్యరూపంలోకి రానున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ సంస్థతో పాటు ఇతర అంశాలపై త్వరలో స్పష్టత రానుంది.

## మెనూలో ప్రేమ ఉండదు!

'ప్రేమలు'తో కుర్రకారుని విశేషంగా ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ప్రస్తుతం అగ్ర తారల సరసన అవకాశాలను అందుకుంటూ జోరు చూపిస్తున్న ఈ భామ.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది.
'ప్రేమలు'తో కుర్రకారుని విశేషంగా ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ప్రస్తుతం అగ్ర తారల సరసన అవకాశాలను అందుకుంటూ జోరు చూపిస్తున్న ఈ భామ.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. ఇందులో మమితాకు జోడీగా మలయాళ నటుడు సంగీత్ ప్రతాప్ కనిపించనున్నారు. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ ఫొటోను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ''అనుకోకుండా ఒకరినొకరు ఆర్డర్ చేసుకునే వరకు.. ప్రేమ ఎప్పుడూ మన మెనూలో ఉండదు'' అని వ్యాఖ్యల్ని జోడించింది. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా పేరు, దర్శకుడి వివరాల్ని త్వరలో వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. దీంతో పాటు ఆమె, ప్రదీప్ రంగనాథన్ సరసన 'డ్యూడ్' అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం మమితా పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె ఇందులో కురల్ అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుపుతూ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం.






## అనుపమ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ నిరాకరణ!

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'కు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరించింది.
కేంద్రమంత్రి, నటుడు సురేశ్ గోపి, నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' . దీనికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరించడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. జానకి అనే మహిళ చేసే న్యాయపోరాటం చుట్టూ తిరిగే కథగా దీన్ని ప్రవీణ్ నారాయణ్ తెరకెక్కించారు. సీతాదేవి మరో పేరైన జానకిని అలాంటి పాత్రకు పెట్టకోలేమని పేర్కొంటూ ఈ చిత్రం స్క్రీనింగ్‌కు అనుమతి నిరాకరించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ సినిమా ప్రదర్శనకు సెన్సార్ బోర్డు అనుమతి నిరాకరించిందని దర్శకుడు కూడా వెల్లడించారు. ఇక ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ దర్శకుడు ఉన్నికృష్ణన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సినిమాలో జానకి అనే పేరును ఉపయోగించరాదని సెన్సార్ బోర్డు ఈ చిత్ర నిర్మాతలకు స్పష్టంగా తెలియజేసినట్లు చెప్పారు. టైటిల్, పాత్ర పేరును మార్చాలని బోర్డు చిత్రబృందానికి సూచించినట్లు తెలిపారు. దాడికి గురైన మహిళ పాత్రకు సీతాదేవి పేరును పెట్టలేమని బోర్డు చెప్పిందన్నారు. ఇటీవల మరో మలయాళ చిత్ర నిర్మాత తన సినిమాలో జానకి అనే పాత్ర పేరు విషయంలో ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. వారు సెన్సార్ సర్టిఫికెట్ పొందడానికి ఆ పేరును 'జయంతి'గా మార్చారని తెలిపారు. థ్రిల్లర్ కథాంశంతో 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' రూపొందింది. సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తుందనేది ఉప శీర్షిక. ఇందులో జానకిగా అనుపమ కనిపించనున్నారు. లాయర్‌గా ప్రముఖ నటుడు సురేశ్ గోపి నటించారు. జూన్ 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

## డ్రగ్స్ కేసు.. నటుడు శ్రీరామ్ అరెస్టు

డ్రగ్స్ కేసులో నటుడు శ్రీకాంత్ అలియాస్ శ్రీరామ్‌ను చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ కేసులో నటుడు శ్రీకాంత్ అలియాస్ శ్రీరామ్‌ను చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. నార్కోటిక్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలినట్టు సమాచారం.ఈ వ్యవహారంలో నటుడు దాదాపు నాలుగున్నర లక్షల రూపాయల అనుమానాస్పద లావాదేవీలు జరిపినట్టు పోలీసులు గుర్తించారు. అతడు 40 సార్లు కొకైన్ కొన్నట్టు ఆరోపణలున్నాయి. ఏఐఏడీఎమ్‌కే ఐటీ వింగ్ మాజీ నేత ప్రసాద్ అరెస్టు.. శ్రీరామ్ అరెస్టుకు దారితీసింది. ఓ పబ్‌లో ప్రసాద్ ఘర్షణకు దిగగా పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారించారు. ఆ క్రమంలో డ్రగ్స్ వ్యవహారం బయటపడింది.ప్రసాద్ ఇచ్చిన సమాచారంతో నుంగంబాక్కం పోలీసులు శ్రీరామ్‌ని అదుపులోకి తీసుకున్నారు. యాంటీ నార్కోటిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించగా శ్రీరామ్ డ్రగ్స్ వాడినట్టు తేలిందని తెలిసింది.'రోజాపూలు' సినిమాతో తెలుగులో మంచి గుర్తింపు పొందారు శ్రీరామ్. 'ఒకరికి ఒకరు', 'ఆడవారి మాటలకు అర్థాలు వేరులే' తదితర చిత్రాలు, 'హరికథ' వంటి వెబ్‌సిరీస్‌ల్లో కీలక పాత్రలు పోషించారు.





# భారత్ 'పసిడి' పట్టు

ఆసియా అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో టీమ్ టైటిల్ సొంతం

వుంగ్ తౌ (వియత్నాం): తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత పురుషుల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ జట్టు... ఆసియా అండర్-23 చాంపియన్‌షిప్‌లో టీమ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో భారత రెజ్లర్లు ఆరు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకంతో కలిపి మొత్తం ఏడు పతకాలతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. భారత్ తరఫున నిఖిల్ (61 కేజీలు), సుజీత్ కల్కాల్ (65 కేజీలు), జైదీప్ (74 కేజీలు), చందర్ మోహన్ (79 కేజీలు), సచిన్ (92 కేజీలు), విక్కీ (97 కేజీలు) పసిడి పతకాలను గెల్చుకున్నారు. జస్‌పూరణ్ సింగ్ (125 కేజీలు) రజత పతకాన్ని సాధించాడు. ఫైనల్స్‌లో నిఖిల్ 7-2తో మెరీ బజర్‌బయేవ్ (కజకిస్తాన్)పై, సుజీత్ 10-0తో ఉమిద్‌జాన్ జలోలోవ్ (ఉజ్బెకిస్తాన్)పై, జైదీప్ 7-0తో జఫర్‌బెక్ (ఉజ్బెకిస్తాన్)పై, చందర్ మోహన్ 5-2తో బెజెన్‌జోవ్ (తుర్క్‌మెనిస్తాన్)పై, సచిన్ 5-2తో తుముర్‌బాటర్ (మంగోలియా)పై, విక్కీ 9-6తో నూర్‌దౌలత్ బెకెనోవ్ (కజకిస్తాన్)పై నెగ్గారు. జస్‌పూరణ్ 3-4తో బత్‌బాయెర్ (మంగోలియా) చేతిలో ఓడిపోయాడు. ఇదే టోర్నీలో భారత మహిళల ఫ్రీస్టయిల్ జట్టు కూడా పోటీపడ్డ 10 వెయిట్ కేటగిరీల్లో పతకాలు గెలిచి టీమ్ టైటిల్‌ను సాధించింది.





# బౌలర్లపైనే భారం.. ఇంగ్లాండ్ 21/0.. నాలుగో రోజు ముగిసిన ఆట

**ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న తొలి టెస్టులో నాలుగో రోజు ఆట ముగిసింది.**

**లీడ్స్:** ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న తొలి టెస్టులో నాలుగో రోజు ఆట ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌లో 90/2తో ఆటను ప్రారంభించిన టీమ్ఇండియా 364 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలోనే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో (6 పరుగులు) కలుపుకొని ఇంగ్లాండ్‌కు 371 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన ఇంగ్లాండ్ ఆట ముగిసేసరికి 21/0 స్కోరుతో నిలిచింది. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 350 పరుగులు అవసరం. ఇంకా రోజు ఆట మిగిలి ఉండటంతో మ్యాచ్ ఫలితం తేలే అవకాశాలే ఎక్కువ. బౌలర్లు సమష్టిగా రాణించడంపైనే టీమ్ఇండియా విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

**31 పరుగులు.. ఆరు వికెట్లు**

కేఎల్ రాహుల్ (137; 247 బంతుల్లో 18 ఫోర్లు), రిషభ్ పంత్ (118; 140 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు బాదడంతో నాలుగో రోజు రెండో సెషన్ ముగిసేసరికి భారత్ 298/4తో నిలిచి భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ, తొలి ఇన్నింగ్స్ మాదిరిగానే ఆఖర్లో వరుసగా వికెట్లు కోల్పోయింది. 31 పరుగుల వ్యవధిలో ఆరు వికెట్లు చేజార్చుకుని తక్కువ స్కోరుకే ఆలౌటైంది. జట్టు స్కోరు 333 పరుగుల వద్ద కేఎల్ రాహుల్ ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. అక్కడి నుంచి వికెట్లు టపాటపా పడ్డాయి. ఆ వెంటనే కరుణ్ నాయర్ (20) పెవిలియన్ చేరాడు. శార్దూల్ ఠాకూర్ (4), సిరాజ్ (0), బుమ్రా (0)లను జోష్ టంగ్ ఒకే ఓవర్‌లో ఔట్ చేశాడు. రవీంద్ర జడేజా(25*) ఆఖర్లో కాస్త దూకుడుగా ఆడాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 3, జోష్ టంగ్ 3, బషీర్ 2.. క్రిస్ వోక్స్, బెన్ స్టోక్స్ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 471, ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

**ఇంగ్లాండ్‌లో తొలి భారత బ్యాటర్‌గా**

తొలి ఇన్నింగ్స్‌లో 146 బంతుల్లో సెంచరీ చేసిన పంత్ .. రెండో ఇన్నింగ్స్‌లో 130 బంతుల్లోనే మూడంకెల స్కోరు అందుకున్నాడు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్‌లో ఒకే టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీ చేసిన తొలి భారత ఆటగాడిగా పంత్ రికార్డు సృష్టించాడు. అంతేకాదు ఒకే మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో శతకం బాదిన రెండో వికెట్‌కీపర్‌గా నిలిచాడు. అంతకుముందు ఆండీ ఫ్లవర్ (జింబాబ్వే).. 2001లో సౌతాఫ్రికాపై (142, 199*) ఈ ఫీట్ సాధించాడు.



# బుమ్రాను ఎదుర్కోవడం చాలా కష్టం

జస్‌ప్రీత్ బుమ్రా ప్రపంచ అత్యుత్తమ బౌలర్ అని.. అతడిని ఎదుర్కోవడం చాలా కష్టమని ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్ అన్నాడు. భారత్‌ఇంగ్లాండ్ తొలి టెస్టు 2, 3 రోజుల్లో గొప్పగా బౌలింగ్ చేసిన బుమ్రా.. అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

**లీడ్స్:** జస్‌ప్రీత్ బుమ్రా ప్రపంచ అత్యుత్తమ బౌలర్ అని.. అతడిని ఎదుర్కోవడం చాలా కష్టమని ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్ అన్నాడు. భారత్‌ఇంగ్లాండ్ తొలి టెస్టు 2, 3 రోజుల్లో గొప్పగా బౌలింగ్ చేసిన బుమ్రా.. అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ''ప్రపంచంలో బుమ్రా అత్యుత్తమ బౌలర్. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అతడిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఒకే ఓవర్లో బుమ్రా ఆడశక్యం కాని బంతులు కనీసం మూడు, నాలుగు వేస్తాడు. బౌన్సర్ వేస్తాడా.. స్లో డెలివరీ సంధిస్తాడా.. యార్కర్ విసురుతాడా.. ఇన్, ఔట్ స్వింగర్లు వదలుతాడా అని అంచనా వేయడం కష్టం'' అని డకెట్ పేర్కొన్నాడు. కష్టమైన బుమ్రా బౌలింగ్‌కు నిలిచి పోప్ సెంచరీ సాధించాడని డకెట్ ప్రశంసించాడు. ''ఉత్తమ బౌలింగ్ దాడిని ఎదుర్కొని సెంచరీ చేయడానికి మించిన ఆనందం ఏం ఉంటుంది? బుమ్రా బౌలింగ్‌కు నిలిచిన పోప్‌కు ఇలాంటి సంతోషమే దక్కింది. ప్రశాంతంగా ఆడి అతడు మూడంకెల స్కోరు సాధించాడు'' అని డకెట్ తెలిపాడు.

# రెండో సెంచరీ తర్వాత పంత్ స్పెషల్ సెలబ్రేషన్.. ఈ OK గురించి తెలుసా?

**లీడ్స్ టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన తర్వాత రిషభ్ పంత్ చేసిన సెలబ్రేషన్ అర్థం తెలుసా?**

లీడ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు లో భారత వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ సెంచరీ నమోదు చేశాడు. ఈ క్రమంలో పంత్ చేసిన సెంచరీ సెలబ్రేషన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏంటా సెలబ్రేషన్, దాని వెనుక కథేంటో చూద్దాం!

ఇదే టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతకం సాధించిన తర్వాత పంత్ సోమర్‌సాల్ట్ చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ తర్వాత కూడా అలానే చేస్తాడేమో అనుకున్నారంతా. గ్లవ్, హెల్మెట్ తీసి రెడీ అయ్యేలా కనిపించాడు. మైదానంలో ఉన్న దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ కూడా ఇదే కోరాడు. కానీ పంత్ అలా చేయలేదు. చూపుడు వేలు, బొటన వేలిని కలిపి సున్నాలా చూసి అందులోంచి చూశాడు. ఇదేదో సరదాగా చూశాడు అనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఇది స్పోర్ట్స్‌లో ఇది ఫేమస్ సెలబ్రేషన్. దీనిని 'డెలీ అలీ సెలబ్రేషన్' అంటారు. ప్రముఖ సాకర్ ప్లేయర్ డెలీ అలీ ఏడేళ్ల క్రితం చేసుకున్న గోల్ ఉత్సవం అది. టోటెన్‌హమ్ హాట్‌స్పర్ సాకర్ జట్టుకు చెందిన డెలీ ఆగస్టు 2018లో న్యూక్యాజిల్‌తో జరిగిన మ్యాచ్‌లో గోల్ చేశాక ఈ స్పెషల్ సెలబ్రేషన్ చేసుకున్నాడు. దీనికి ఓకే అని అర్థమట. అప్పట్లో ఈ సంబరం పెద్ద సెన్సేషన్ అయింది. చాలామంది అలా వేలిని మడిచి కళ్ల ముందు పెట్టుకుని చూడటానికి ట్రెండ్‌లా చేశారు. సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలను షేర్ చేశారు. ఆ తర్వాత ఈ ట్రెండ్ తగ్గుముఖం పట్టి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. అయితే ఇప్పుడు రిషభ్ పంత్ మళ్లీ ఆ సెలబ్రేషన్ చేయడంతో మరోసారి 'డెలీ అలీ' ఉత్సవం బయటకు వచ్చింది. పంత్ ఇలా డెలీ అలీని ఎందుకు అనుసరించాడో మరి!





# దివిత్ రెడ్డికి కాంస్య పతకం

**హైదరాబాద్:** జాతీయ అండర్-9 చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తెలంగాణకు చెందిన అదుళ్ల దివిత్ రెడ్డి కాంస్య పతకం సాధించాడు. హరియాణాలో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత దివిత్‌తో పాటు మరో ఐదుగురు 8.5 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... దివిత్‌కు కాంస్య పతకం ఖరారైంది. 10 పాయింట్లతో సాత్విక్ స్వయిన్ (ఒడిశా) విజేతగా అవతరించగా... 9.5 పాయింట్లతో ఆదివిక్ అభినవ్ కృష్ణ (కర్ణాటక) రన్నరప్‌గా నిలిచాడు. 150 మంది ప్లేయర్ల మధ్య స్విస్ ఫార్మాట్‌లో జరిగిన ఈ టోర్నీలో దివిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో మాత్రమే ఓడిపోయాడు. గత ఏడాది నవంబర్‌లో ఇటలీలో జరిగిన ప్రపంచ క్యాడెట్ చెస్ చాంపియన్ షిప్‌లో దివిత్ రెడ్డి అండర్-8 ఓపెన్ విభాగంలో... ఏప్రిల్‌లో అల్బేనియాలో జరిగిన ప్రపంచ క్యాడెట్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ అండర్-8 ఓపెన్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించడం విశేషం. మరోవైపు బాలికల విభాగంలో తెలంగాణకు చెందిన సాయి అన్విత 8.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్యం చేజార్చుకుంది. వ్రిత్తి అగర్వాల్‌కు కాంస్య పతకంభువనేశ్వర్: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పతకాల బోణీ చేసింది. తెలంగాణకు చెందిన వ్రిత్తి అగర్వాల్ మహిళల 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. ఆదివారం జరిగిన 400 మీటర్ల ఫైనల్‌ను వ్రిత్తి 4 నిమిషాల 30.05 సెకన్లలో ముగించి మూడో స్థానాన్ని దక్కించుకుంది. భవ్య సచ్‌దేవ (ఢిల్లీ; 4ని:26.66 సెకన్లు) స్వర్ణ పతకం... అదితి సతీశ్ హెగ్డే (మహారాష్ట్ర; 4ని:29.48 సెకన్లు) రజత పతకం గెల్చుకున్నారు.

# 'క్వీన్స్ క్లబ్' కింగ్ అల్‌కరాజ్.. ప్రైజ్ మనీ ఎంతంటే?

**లండన్:** ఈ ఏడాది తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ ఐదో సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం ముగిసిన క్వీన్స్ క్లబ్ ఏటీపీ-500 టోర్నీలో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ చాంపియన్‌గా నిలిచాడు. 2 గంటల 8 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 7-5, 6-7 (5/7), 6-2తో జిరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందాడు.

**ప్రైజ్‌మనీ ఎంతంటే?**

విజేత అల్‌కరాజ్‌కు 4,71,755 యూరోల (రూ. 4 కోట్ల 70 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ లెహెస్కాకు 2,53,790 యూరోల (రూ. 2 కోట్ల 53 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 330 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఫైనల్లో అల్‌కరాజ్ 18 ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోలేదు. ఓవరాల్‌గా అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది 21వ సింగిల్స్ టైటిల్. ఈ ఏడాది అల్‌కరాజ్ రొటర్‌డామ్ ఓపెన్, మోంటెకార్లో మాస్టర్స్, రోమ్ మాస్టర్స్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో విజేతగా నిలిచాడు.



**ఇదీ చదవండి: రెండేళ్ల తర్వాత... మరో సింగిల్స్ టైటిల్**

**బెర్లిన్:** హోరాహోరీ పోరులో పైచేయి సాధించిన చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్ మర్కెటా వొండ్రుసోవా... రెండేళ్ల తర్వాత తన కెరీర్‌లో మరో సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన బెర్లిన్ ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో 25 ఏళ్ల వొండ్రుసోవా విజేతగా అవతరించింది. 2 గంటల 16 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో ప్రపంచ 164వ ర్యాంకర్ వొండ్రుసోవా 7-6 (12/10), 4-6, 6-2తో ప్రపంచ 49వ ర్యాంకర్ జిన్‌యు వాంగ్ (చైనా)పై విజయం సాధించింది. 2023లో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గి సంచలనం సృష్టించిన వొండ్రుసోవా ఆ తర్వాత మరో టైటిల్‌ను అందుకోలేకపోయింది. జిన్‌యు వాంగ్‌తో జరిగిన ఫైనల్లో వొండ్రుసోవా ఆరు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. టైటిల్ గెలిచే క్రమంలో వొండ్రుసోవా సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబెలెంకా (బెలారస్)పై, తొలి రౌండ్‌లో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా)పై, క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మాజీ రెండో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యూనిషియా)పై నెగ్గడం విశేషం. విజేతగా నిలిచిన వొండ్రుసోవాకు 1,42,610 యూరోల (రూ. 1 కోటీ 42 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.